

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**సంతకం** చేసి తీసుకుందా కవర్ని.

స్టేన్లీ నుంచి ఆ బర్త్‌డే గ్రీటింగ్.

అందులో ప్రింట్ అయిన మెసేజ్ కింద స్టేన్లీ చేతి వ్రాతలో ఇంగ్లీష్‌లో ఈ వాక్యం ఉంది

"తిరస్కారం నేను భరించలేను నన్ను పెళ్ళి చేసుకుంటావా? లవ్"

అతని సంతకం ఉంది కింద.

వాణి ఆ కార్డుని ముద్దుపెట్టుకుని బయటకు చెప్పింది.

"ఎస్ స్టేన్లీ"

అదే సంగతి రాసింది అతనికి మర్నాడు

ముకుందం కూడా తన ప్రేమ పుస్తకంలో వాణిని ఉద్దేశించి ఓ వాక్యం రాశాడారోజు.

"మరణించే నన్ను 'సరే' అనే మందుతో బతికించు. నన్ను పెళ్ళి చేసుకోవా అని నేనడిగితే నీ సమాధానం ఏమిటి?"

రాజమండ్రికి ఆ వీకెండ్‌కి ఫోన్ వచ్చింది వెంకటేశ్వరరావు నుంచి. ముందు తన తండ్రితో, తర్వాత కూతురితో మాట్లాడాడాయన. సెయింట్ లూయీ నుంచి ఆయన కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్‌ఫ్రాన్సిస్కోకి మారుతున్నాడు.

"అక్కడ కొత్త ఉద్యోగం వచ్చిందా?" అడిగాడు శివయ్య.

"అవును నాన్నగారూ!"

వెంకటేశ్వరరావు అమెరికాకు వెళ్ళాక సగటున మూడు నాలుగేళ్ళకొకసారి ఊరు మారుతుండడం శివయ్యకు తెలుసు.

'హస్తవాసి మంచిదని పేరు తెచ్చుకున్న ఊరినుంచి యింకో ఊరికి మారితే ఎలా?' అన్న ప్రశ్న ఆయనలో ఉదయిస్తూ ఉంటుంది. అందుకు సమాధానంగా 'ఇది ఇండియాకాదు నాన్నగారూ! అలాంటివి ఇక్కడ ఉండవు' అంటాడు వెంకటేశ్వరరావు. ముందు ఒంటరిగా వెళ్ళి ఇల్లూ అదీ చూసుకున్నాడు.

సేన్‌లియాండ్రో, బర్కిలి, సేనోజే, లివర్‌మోర్, ఓక్‌లాండ్‌లాటి ప్రదేశాలన్నీ చూశాక సేనోజాలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. వారం తర్వాత సెయింట్ లూయీ నుంచి వెంకటేశ్వరరావు కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉన్న సేనోజేకి మారాడు.

యుహాల్ కంపెనీనుంచి ట్రక్‌ని అద్దెకు తీసుకున్నాడాయన. అందులో తమ సామాను నింపుకుని లీషర్‌గా సేనోజేకి ప్రయాణం అయ్యారు.

నాలుగు గంటలు ఆయన, మిగిలిన నాలుగు గంటలు లక్ష్మి డ్రైవ్ చేసేవారు.

రాత్రి మోటెల్‌లో గది అద్దెకు తీసుకుని పడుకుని, మరునాడు ఉదయం మళ్ళీ రోడ్డెక్కేవారు.

సేనోజేలో కొత్త ఇంట్లో సామాను దింపుకున్నాక అక్కడున్న యుహాల్ ట్రక్ సర్వీస్ కంపెనీ బ్రాంచ్‌లో ఆ ట్రక్ అప్పగించేసి మిగిలిన సొమ్ముని చెల్లించారు.

సేనోజేలో కొత్త ఇంట్లోంచి రాజమండ్రికి ఫోన్ చేసి చిరునామా చెప్పారు వాణికి.

## 15

కాలేజీలో ఇంగ్లీష్ క్లాసు జరుగుతూండగా క్లాస్ రూములో కొచ్చాడు శివయ్య పాలేరు. లెక్చరర్‌తోపాటు స్టూడెంట్స్ కూడా అతనివైపు చూసారు.

"మా వాణమ్మ చదివేది ఈ కళాసులోనేనా?"

అతని మొహంలోని ఆదుర్దా గమనించి లేచి నిలబడి అడిగింది వాణి.

"ఏమిటి విశేషం?"

"నువ్వోసారి అర్జంటుగా హాస్పటల్‌కి రావాలి. మీ తాతయ్యకు ఒంట్లో బాగోలేదమ్మా"

"ఏమయింది?" అడిగింది లెక్చరర్ వెంటనే.

"గుండెపోటు వచ్చింది. సంగీతమ్మ హాస్పటల్లో ఉంది."

వాణి వెంటనే డెస్క్ మీది పుస్తకాలు అందుకుని లెక్చరర్‌తో చెప్పింది.

"నే వెళతా మేడమ్"

అతనివెంట గబగబా నడిచింది. అప్పటికే క్లాసులో గుసగుసలు మొదలయ్యాఇ.

వాణి వెళ్ళాక పాఠం సరిగ్గా సాగలేదు ఆ క్లాసులో.

కాలేజీ  ముందు ఎక్కిన రిక్షా హాస్పిటల్ ముందాగింది. వాణి రిక్షాలోంచి దిగింది.

సైకిల్ దిగి స్టాండ్ వేసిన పాలేరును అనుసరించింది వాణి.

ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లోని విజిటర్స్ గదిలోని సంగీత వాణిని చూడగానే గట్టిగా యేడ్చేసింద్ది.

"ఏమయింది?" అడిగింది వాణి.

"మధ్యాహ్నం భోజనం అయ్యాక పడుకున్నారు. అయిదు నిమిషాల తర్వాత ఛాతీ నొప్పిగా ఉందన్నారు. బాగా చెమటలు పోసాయి. ఇంక నొప్పి భరించలేనంటే హాస్పిటల్‌కి వచ్చేశాం. రాగానే నీకు కబురు చేశాను"

"ఇంటినుంచి ఎలా వచ్చారిక్కడికి?"

"బస్‌లో, రిక్షాలో"

"బస్టాప్‌దాకా నడిచారా తాతయ్య?"

"అవును"

"ఛ! గుండెపోటు వచ్చినవాళ్ళు నడవకూడదు. ఎక్కడ ఉన్నారు?"

డాక్టర్‌ని కలిసింది వాణి.

డ్రిప్ పెట్టి దానిద్వారా మందు ఎక్కిస్తున్నారు ఆయనకి.

"హౌ సీరియస్ ఈజ్ ఇట్ డాక్టర్?" అడిగింది వాణి.

"మాసివ్ అటాక్"

"మా నాన్నగారు స్టేట్స్‌లో ఉన్నారు. ఫోన్ చేసి పిలిపించమంటారా?" అడిగింది వాణి.

"మరో వారం పదిరోజుల్లో మళ్ళీ అటాక్ రాకపోతే ఓకె.. లేదా...?"

వాణి ఆ హాస్పిటల్ ఫోన్ నెంబరు, డాక్టర్‌గారి పేరు రాసుకుంది.

వాణి ఐ.ఎస్.డి బూత్ నుంచి ఇంటికి ఫోన్ చేసింది. అక్కడ అర్ధరాత్రి మ్రోగింది ఫోన్. రాత్రి ఆన్సరింగ్ మెషిన్ పనిచేసేలా ఏర్పాటు చేయడంతో అది పనిచేసింది. వాణి తల్లి లక్ష్మి కంఠం వినిపించింది ఇంగ్లీష్‌లో.

"హల్లో యూ హేవ్ రీచ్డ్ మిష్టర్ వి.ఆర్. చల్లాస్ రెసిడెన్స్. వి.ఆర్. ఎవే రైట్ నౌ. బట్, వి.విల్ గెట్‌బాక్ టు యు యాజ్ సూన్ యాజ్ పాసిబుల్. ప్లీజ్ లీవ్ యువర్ నేమ్ అండ్ ఫోన్ నంబర్ ఆఫ్టర్ యు హియర్ త్రీ బ్లీప్స్. థాంక్యూ"

ఆ బ్లీప్స్ విన్నాక చెప్పింది వాణి.

"మామ్! వాణిని. తాతయ్యకి మాసివ్ హార్ట్ ఎటాక్ వచ్చింది. రాజమండ్రిలో హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యారు. హాస్పిటల్ పేరు శ్రీదేవి నర్సింగ్ హోం.." నంబర్ చెప్పాక చెప్పింది - "మీరీ మెసేజ్ నంబర్ వినగానే హాస్పిటల్‌కి ఫోను చేయండి. నేనక్కడే ఉంటాను. డాక్టర్ పేరు అప్పారావు."

హైదరాబాద్‌లోని తన బాబాయికి కూడా ఫోను చేసి జరిగింది వివరించింది.

ఆ రాత్రికి ఏడుంపావుకి వెంకటేశ్వరరావు ఫోను చేసాడు. డాక్టర్ అప్పారావుతో మాట్లాడాడు. ఆ సంభాషణ విన్న తర్వాత తను వెంటనే బయలుదేరడమే మంచిదని నిర్ణయించుకున్నాడు. డాక్టర్ అయిన వెంకటేశ్వరరావుకి అర్థమయింది తన తండ్రి బ్రతకడం అదృష్టం మీదే ఆధారపడి ఉందని. ఆ అటాక్ వల్ల లోపల ఎంత డేమేజ్ జరిగిందో ఆయన ఊహించగలిగాడు .

పాలేరు విఠల్ ఇంటికి వెళ్ళి జరిగింది చెప్పాడు. ముకుందం తండ్రి, తల్లి వెంటనే హాస్పటల్‌కి వచ్చారు.

సంగీతకన్నా వాణే ధైర్యంగా ఉంది. ఇద్దరికీ ధైర్యం చెప్పాడు విఠల్.

అమెరికాలో అతి అరుదయినది సెలవు. ఉద్యోస్తులకి ఓ పట్టాన సెలవు ఇవ్వరు. సెలవు నిరాకరించినప్పుడు ఆఫీసుకు రాకపోతే ఎన్నేళ్ళుగా పనిచేస్తున్నా సరే, ఉద్యోగంలోనుంచి తీసేస్తారు. అలా ఫైర్ చేయడం అక్కడ సర్వసాధారణం. ఇండియాలోలాగా జాబ్ సెక్యూరిటీ ఉండదు. ఉద్యోగం ఇచ్చినవారికే తీసేసే అధికారం ఉంటుంది.

నిజానికి వెంకటేశ్వరరావుకి సెలవు దొరికేదికాదు. అతని తండ్రి హార్ట్ ఎటాక్ గురించి తెలిశాక సెలవు ఇవ్వడమే కాక, స్టాఫ్ అంతా వచ్చి అతనికి తమ సానుభూతి తెలియచేశారు.

వెంకటేశ్వరరావు ఎస్.ఎఫ్.ఓ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఎక్కిన శాన్‌ఫ్రాన్సిస్కో - సింగపూర్ - మద్రాసు విమానం శివయ్యకి హార్ట్ ఎటాక్ వచ్చిన ఏడో గంటలో గాల్లోకి లేచింది.

అది మద్రాసులో ఇంకో గంటలో లాండవుతుందనగా శివయ్య ఇంటెన్సివ్ కేర్‌లో ఉండగానే మరోసారి హార్ట్‌ఎటాక్ వచ్చి పోయాడు.

వెంకటేశ్వరరావు మద్రాసులో లాండవగానే ఎయిర్‌పోర్ట్ నుంచి హాస్పిటల్‌కు ఫోన్ చేసాడు. తను ఫలానా రైల్లో వస్తున్నానని చెప్పడానికి.

అతను లాండవగనే ఫోను చేస్తాడని ఊహించి వాణి అందుకోసం ఫోను దగ్గరే వేచి ఉంది.

"డేడ్ - ఐ యామ్ సో సారీ. గ్రాండ్ పా.." ఏడుపు అడ్డుపడింది వాణి కంఠానికి.

''ఏమైంది?'' అడిగాడు వెంకటేశ్వరరావు అవతలనుంచి కంగారుగా.

''గ్రాండ్ పా పాస్డ్ ఎవే పీసుఫుల్లీ ఇన్ హిజ్ స్లీప్. ది బాడీ ఈజ్ ఆన్ ది ఐస్‌బ్లాక్స్. ఎవైటింగ్ ఫర్ యూ''

''మైగాడ్''

''ఐయామ్ సో సారీ డేడ్''

''ఐ యామ్ ఆన్ మై వే హనీ''

వెంకటేశ్వరరావు రిసీవర్ పెట్టేశాడు. ఎంత కంట్రోల్ చేసుకున్నా అతనికి ఏడుపు ఆగలేదు. కొద్దినిముషాల్లో దుఃఖాన్ని కంట్రోల్ చేసుకుని డబ్బు చెల్లించి బయటకు వచ్చాడు.

విజయవాడ వైపు ఉన్న ఒక్క రైలు గంట క్రితమే వెళ్ళిపోయిందని తెలిసింది. రైల్వే స్టేషన్‌కి చేరుకున్నాక సేనోజేకి ఫోన్ చేసి తన భార్యకి జరిగింది చెప్పాడు.

వెంటనే లక్ష్మిని బయలుదేరమన్నాడు. రాత్రి బయలుదేరే రైలు ఎక్కి మర్నాడు ఉదయం రాజమండ్రికి చేరుకున్నాడు. పాలేరు, విఠల్ అతని బావమరిది స్టేషన్ బయట వెయిట్ చేస్తున్నారు.

సరాసరి టాక్సీలో తన గ్రామం చేరుకున్నాడు వెంకటేశ్వరరావు. పంచలో ఉంది శవం. తల దగ్గర ప్రమిద, కర్పూరం వాసన. కరిగి దారకట్టి కారిన ఐస్ నీళ్ళ మడుగు. వెంకటేశ్వరరావు తండ్రి కాళ్ళదగ్గర కూర్చుని చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. అతని దుఃఖానికి అంతంలేదు.

అతని దుఃఖాన్ని చూసి మరోసారి అందరి కళ్ళూ చెమర్చాయి.

కర్మ మొదలు పెట్టిన రెండవరోజు వచ్చింది లక్ష్మి అమెరికానుంచి. తన తండ్రికి అంతిమ సంస్కారాన్ని యధావిధిగా జరిపించాడు వెంకటేశ్వరరావు. ఖర్చు దగ్గర రాజీపడలేదు. జూడీ, సుసాన్‌లనుంచి సింపతీ కార్డ్స్ వాణికి వచ్చాయి వాళ్ళకి విషయం తెలియడంతో. అలాగే వెంకటేశ్వరరావు పనిచేసే ఫస్ట్ మెథడిస్ట్ హాస్పిటల్ స్టాఫ్ అందరి సంతకాలతో కూడా పోస్టులో సింపతి కార్డు వచ్చింది.

పదమూడోరోజు పుణ్యవచనం అయ్యాక వెంకటేశ్వరావుని అడిగింది లక్ష్మి తల్లి ''సంగీతని, వాణిని ఏం చేద్దామనుకుంటున్నారు?''

లక్ష్మి అప్పటికే తల్లితో చర్చించి ఏం చేయాలో డిసైడ్ చేసింది.

''ఇద్దరిని మాతో తీసుకెళ్ళిపోతాం'' చెప్పాడాయన.

''మా ఇంట్లో ఉంచితే అందుకు నాకెలాంటి అభ్యంతరం లేదు. అక్కడే చదువుకుంటారు?''

''ఊహూఁ తీసుకువెళతాం.''

''కానీ వీసా ప్రాబ్లం అంటూంటారు. సంగీతను తీసుకెళ్ళొచ్చా మీరు?'' అడిగిందావిడ.

''ఈ రోజు రావచ్చని తెలుసు నాకు. అందుకే దానిచేత ఎన్నడో ఇమ్మిగ్రేషన్ వీసాకి అప్లయ్ చేయించాను. బ్రదర్ సిస్టర్ కోటాలో, ప్రాబ్లం ఏమీలేదు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉంది నాలుగైదు నెలల్లో వీసా వస్తుంది. అప్పటిదాకా హైదరాబాద్‌లోని మా మరిది ఇంట్లో ఉంటుంది'' చెప్పింది లక్ష్మి.

వెంకటేశ్వరరావు గోదావరిలో, హరిద్వార్‌లోని గంగలో అలహాబాదులోని త్రివేణి సంగమంలో తండ్రి అస్థికలు నిమజ్జనం చేశాడు.

వాణి చెప్పింది తన తండ్రితో.

''డేడ్! నీతో మాట్లాడాలి''

''ఏమిటి?'' అన్నాడు ఆయన టెన్స్‌గా చూస్తూ.

"అన్నీ ఆలోచించుకునే నన్ను అమెరికాకి తీసుకువెళుతున్నారా" అడిగింది.

"అంటే?"

"మళ్ళీ నేను వచ్చేది డేటింగ్ సంప్రదాయం ఉన్న దేశానికి. ఇండియాలో ఇండియన్‌లా జీవించాను. ఏ దేశంలో ఆ దేశస్తురాలిలా జీవించాల్సి వస్తుంది.

"నీ మొండితనం నాకు తెలుసు కాని, మాట్లాడకుండా పద" చెప్పాడాయన కోపంగా.

స్టేన్లీ కొన్ని వందలమైళ్ళ దూరానికి మారాడు. కాబట్టి వెంకటేశ్వరరావు అది పెద్ద సమస్యగా తీసుకోలేదు.

బాపన్న వచ్చాడు సాయంకాలం.

"వాణీ! నీతో ఓ అయిదు నిముషాలు ఒంటరిగా మాట్లాడాలి" చెప్పాడు.

"దేని గురించి?" అడిగింది లక్ష్మి చిరాగ్గా.

"బాపన్న అమెరికా స్టూడెంట్‌గా వద్దామనుకుంటున్నాడు మమ్మీ" చెప్పింది వాణి.

ఇద్దరూ చెరువు గట్టుకు వెళ్ళారు.

"ముకుందానికి నువ్వంటే ఎంతో ఇష్టం"

"అఫ్‌కోర్స్ నాకు తెలుసది."

"మరి నీకు ఇష్టంలేదా?"

"అదేం ప్రశ్న? నాకూ ఇష్టమే"

"ఆ ఇష్టం గురించి కాదు నేను మాట్లాడేది"

"అతనికి నిన్ను పెళ్ళిచేసుకోవాలని ఉంది. ఆ ఇష్టం గురించి నేను మాట్లాడేది."

చిన్నగా నవ్వింది వాణి.

"అతనికా ఉద్దేశం ఉంటే హి ఈజ్ ఏన్ ఈడియట్ అన్నానని చెప్పు. అయినా ముకుందం వచ్చి చెప్పొచ్చుగా! ఎందుకీ రాయబారం?"

"నువ్వు నో అంటావన్న భయంతో రాలేదు. నిజానికి నేను నీతో ఈ విషయం మాట్లాడుతున్న సంగతి కూడా అతనికి తెలియదు."

"గుడ్! అలా తెలియకుండానే ఉంచు. ఇంకేదయినా ఉందా! ఇంతేనా?" అడిగింది.

"ఇంతేకాని.."

"ప్రేమ పేరుతో చాలమంది తప్పులు చేస్తూంటారు. ఆ పొరపాటు చేయదలచుకోలేదు నేను" వాణి లేచి ఇంటివైపు నడిచింది.

ఈ సంభాషణ గురించి తెలియని ముకుందం ఆ రాత్రి ప్రేమ పుస్తకంలో ఈ వాక్యం రాశాడు. "నన్ను మీరు పెళ్ళిచేసుకుంటే మీకన్నా అందమైన కూతుళ్ళని మీకిస్తానని పందెం."

ముకుందం తల్లిదండ్రులు వాణిని, ఆమె కుటుంబాన్ని తమింటికి భోజనానికి పిలిచారు. వాణి తప్ప ఇంకెవరూ వెళ్ళలేదు.

ముకుందం తల్లి, సత్యవతమ్మ వాణి అమెరికా వెళ్ళిపోతున్నందుకు బాధపడ్డా, ఆమె తల్లితండ్రుల దగ్గరకు వెళుతున్నందుకు సంతోషాన్ని వ్యక్తం చేసింది.

రాజమండ్రి రైల్వే స్టేషన్‌కి వెళ్ళారు. వాళ్ళకి సెండాఫ్ యివ్వడానికి బాపన్న, ముకుందం రైలు కదులుతూండగా ముకుందం వాణికి గిఫ్ట్ టేప్ చేసిన ఓ పాకెట్ అందించాడు. అది అతను వాణికి రాసిన పుస్తకం.

"ఏమిటిది?" అడిగింది వాణి.

"చిన్న బహుమతి. తీరికున్నప్పుడు చూడు."

"అలాగే థాంక్స్."

రైలు వెళ్ళిపోయాక భారమయిన హృదయంతో ఇంటికి చేరుకున్నాడు ముకుందం. వాణి ఆ పుస్తకం చదివి తనకు సమాధానం రాస్తుందని, అది తనకు ఆనందం కలిగించే సమాధానం అవుతుందన్న నమ్మకం ఏ మాత్రం ముకుందంలో ఏ కోశానా లేదు.

కాని ఆశ ప్రేమికుడి ఊపిరి. వాణి సరేనంటుందన్న ఆశ ఎక్కడో హృదయాంతరాల్లో ముకుందంలో ఉంది కాబట్టే ఆ పుస్తకం ఇచ్చాడు.

మద్రాస్ సెంట్రల్ నుంచి ఎయిర్‌పోర్ట్ దగ్గరున్న హోటల్ ట్రైండెంట్‌కి చేరుకున్నారు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు. ఆ అర్ధరాత్రి సింగపూర్ ఎయిర్ లైన్స్‌లో ఆ ముగ్గురూ మద్రాస్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో బయలుదేరారు.

విమానంలో నిద్ర వచ్చేదాకా మధ్య ఎన్నో కబుర్లు. జూడీ సుసాన్ ఇంకా క్రిస్టమస్‌కి గ్రీటింగ్ కార్డులు వెంకటేశ్వరరావు కుటుంబానికి పంపుతూనే ఉన్నారు. సెయింట్ లూయీలో వెంకటేశ్వరరావు నెలసరి సంపాదన ఎనభయ్ రెండువేల డాలర్లుంటే, శాన్‌ఫ్రాన్సిస్కోలోని కొత్త హాస్పిటల్‌లో లక్షా నాలుగువేల డాలర్లు.

ఇంగ్లీషు స్పెల్లింగ్ ప్రకారం సేనోజే అని కొత్తవాళ్ళు పలుకుతారు కానీ దాన్ని నిజానికి 'సేన్‌హోసే' అని పలకాలి. శాన్‌ఫ్రాన్సిస్కోలోని సేన్ లియండ్రోలాంటి అనేక ప్రదేశాల్లా 'సేనోజే' కూడా స్పానిష్ పేరు.

ఇండియాలో తనకు ఎదురయిన అనేక గమ్మత్తయిన అనుభవాలను తల్లికి వివరించింది వాణి.

"బిచ్చగాడు మనల్ని బిచ్చం అడిగితే ఇవ్వాలి. లేదా, యిచ్చేదాకా వదలకుండా అప్పులవాడిలా వెంటపడతాడు. వంటకి కనీసం రెండు గంటలు ఉదయం, రాత్రి గంటన్నరకి తక్కువ కాకుండా స్పెండ్ చేస్తారు ఆడవాళ్ళు. అక్కడ మనకిలా ముక్కలుగా తరిగిన కూరగాయలమ్మరు. కొనుక్కొచ్చాక మనమే తరుక్కోవాలి. బియ్యం చచ్చినట్లు ఏరుకోవాలి, లేదా రాళ్ళు, బెడ్డలు అన్నంలో వస్తాయి."

లక్ష్మి చెప్పింది వాణికి.

"నీకు బుద్ధి తెలిశాక ఇండియాకి ఓసారి తీసుకెళ్ళాం. తిరిగి వచ్చాక నీ క్లాస్ టీచర్, సమ్మర్‌లో ఎవరెవరు ఏఏ ప్రదేశాలకి వెళ్ళారో, అక్కడ ఏం చూసారో వ్యాసం రాయమని కోరితే నువ్వేమని రాశావో తెలుసా?

మేమి ఇండియాలో రిక్షాలో స్టేషన్ నుంచి ఇంటికెళ్ళాం. నమ్మండి, నమ్మకపోండి. ఆ రిక్షాలు లాగిన గుర్రాలు అచ్చం మనుషుల్లా ఉన్నాయి అని. మీ టీచర్ ఇంటికి ఫోన్ చేసి అడిగింది మనుషుల్లాంటి గుర్రాలు ఇండియాలో ఉంటాయా అని. ఓ మనిషి యింకో మనిషి కూర్చున్న బండిని లాగడం అమెరికాలో తెలియని నువ్వు ఆ మనుషులు గుర్రాలనే అనుకున్నావు."

అది గుర్తొచ్చి వాణి చిన్నగా నవ్వింది.

శాన్‌ఫ్రాన్సిస్కో ఎయిర్‌పోర్టుకి వాణి అక్కయ్య కారు తెచ్చింది.

"పొడుగయ్యావే" చెప్పింది వాణి చెల్లెల్ని పరీక్షగా చూసి.

"నువ్వూ పొడుగయ్యావు."

కారులో ఇంటికి చేరుకున్నారు. దాదాపు మూడేళ్ళ తర్వాత తిరిగి తను పుట్టిన అమెరికా భూభాగం మీద కాలు పెట్టిన వాణికి కొద్దిసేపు అంతా కొత్తగా అనిపించింది.

పరిశుభ్రమైన రోడ్లు, రోడ్ల మీద కార్లు తప్ప ఇండియాలోలా మనుషులు కనిపించకపోవడం, కోకోకోలా, పెప్సీ, సైన్‌బోర్డులు, కే మార్ట్, జెసి పెన్ని కేంటుకి ఫ్రైడ్ చికెన్ షాప్ సైన్స్ ఒక్కొక్కటి చూస్తుంటే 'తను అమెరికా ఎంతగా మిస్ అయిందా' అనిపించింది వాణికి.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments